వరద మొదలైతే తిప్పలే..!

వర్షాకాలం వచ్చేసింది.. వానల రాకతో మారుమూల గ్రామాల ప్రజలకు ఎడతెగని దారి కష్టాలు మొదలవుతాయి. ఊరు నుంచి మండల కేంద్రానికి వెళ్లాలంటే అడ్డుగా ఉన్న వాగు, ఒర్రెలో వరదను దాటాల్సిన దుస్థితి. ఇక గర్భిణుల బాధలు వర్ణనాతీతం. నెలవారీ పరీక్షలు, ప్రసవం కోసం ఆస్పత్రికి చేరాలంటే సాహసం చేయాల్సిందే. ఇప్పటికీ పలువోట్ల వంతెనలు, కల్వర్టుల నిర్మాణాలు అసంపూర్తిగానే ఉన్నాయి. అధికారుల అలసత్వంతో ఏళ్లనాటి ప్రతిపాదనలు కూడా నేటికీ కార్యరూపం దాల్చడం లేదు. మరోవైపు ప్రజాప్రతినిధులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే మిగిలాయి. జిల్లాలోని మారుమూల గ్రామాల దుస్థితిపై 'సాక్షి' ఫోకస్.


ఎర్రవాగులో చిక్కుకున్న ఆటోను బయటకు తీసుకొస్తున్న ప్రజలు (ఫైల్)

- వర్షాలు మొదలైతే ఉప్పొంగనున్న వాగులు, ఒర్రెలు
- అసంపూర్తిగా వంతెనలు, కల్వర్టులు
- మారుమూల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం
- ఏళ్లు గడుస్తున్నా మారని పరిస్థితులు
- ముందస్తు కార్యాచరణ రూపొందించని అధికార యంత్రాంగం

బెల్లంపల్లి: నెన్నెల మండలంలోని లంబాడితండా గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న ఎర్రవాగుపై వంతెన లేక గ్రామీణులు ఏళ్ల తరబడి నుంచి అష్టకష్టాలు పడుతున్నారు. దీంతో వాగుకు అవతలి వైపు ఉన్న లంబాడితండా, కుర్మగూడం, కోణంపేట, బోగంపల్లి, మన్నెగూడం, ఖర్జీ, జంగాల్‌పేట, దమ్మిరెడ్డిపేట (ఎనిమిది గ్రామాలు) ప్రజలు వాగు దాటడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గంటల పాటు నిరీక్షించి వరద ఉధృతి తగ్గాక కానీ, మండల కేంద్రానికి చేరుకోలేని పరిస్థితులు ఉంటున్నాయి. కనీసం అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్ సైతం వెళ్లలేని పరిస్థితులు ఉంటున్నాయి. గత వర్షాకాలంలో ఎర్రవాగు ఉప్పొంగడంతో వాగు నుంచి దాటుతున్న ముగ్గురు వ్యక్తులు గల్లంతైన విషయం తెలిసిందే. వాగు దాటలేక సకాలంలో ఆస్పత్రికి చేరుకోక మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. గర్భిణులను ప్రమాదకర పరిస్థితుల్లో ఎడ్లబండి సాయంతో వాగులు దాటించడం ఏటా సర్వసాధారణమవుతున్నాయి. ప్రమాద సంఘటనలు జరిగినప్పుడు అధికారులు, నాయకులు వచ్చి హామీలు ఇవ్వడం తప్పా, వాగుపై వంతెన నిర్మాణం చేయించడం లేదనే విమర్శలు వస్తున్నాయి.


వేమనపల్లిలో వంతెన నిర్మించాల్సిన ప్రాంతం

బాహ్య ప్రపంచంతో సంబంధాలు బంద్..

భీమిని మండలంలోని తంగళ్లపల్లి గ్రామస్తులు వర్షాకాలంలో నానా తంటాలు పడుతున్నారు. చిన్న తిమ్మాపూర్ పరిధిలోని తంగళ్లపల్లి గ్రామస్తులు ఎరువులు, విత్తనాలకు వెళ్లాలన్నా, అత్యవసరంగా మరో గ్రామానికి వెళ్లాలన్నా వెళ్లలేని పరిస్థితులు ఉంటున్నాయి. అనారోగ్యం చేస్తే 108రాలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

అసంపూర్తిగా నిర్మాణ పనులు...

వేమనపల్లి మండలం చామనపల్లి గ్రామపంచాయతీ ప్రజలు వర్షాకాలంలో దశాబ్దాల నుంచి దారి కష్టాలను అనుభవిస్తున్నారు. ఎగువ ప్రాంతంలో కొద్దిపాటిగా వర్షం కురిసినా పెద్దవాగు ప్రవహించి రాకపోకలు స్తంభించిపోతాయి. వాగు నిర్మాణానికి రూ.8 కోట్ల 24లక్షలు మంజూరైనా ప్రయోజనం లేకుండా పోతోంది. నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పనులు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. టెండర్లు పూర్తయి మూడేళ్లు గడుస్తున్నా, వాగుపై వంతెన నిర్మాణం కాలేదు. దీంతో చామనపల్లితో పాటు బొమ్మెన, నెన్నెల మండలం కుశ్నపల్లి, కోణంపేట నుంచి రాకపోకలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బంది పడాల్సి ఉంటుంది.

చిరు వర్షానికే నిలుస్తున్న రాకపోకలు...

ప్రధాన రహదారికి కూతవేటు దూరంలో ఉన్న మామడ గ్రామానికి చిన్నపాటి వర్షం కురిసినా రాకపోకలు స్తంభిస్తాయి. మార్గమధ్యలో ఉన్న ఒర్రె కొద్దిపాటి వర్షానికే ఉప్పొంగి ప్రవహిస్తోంది. నీల్వాయి, మామడ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. రైతులు, మత్స్యకారులు ఇబ్బంది పడాల్సి ఉంటుంది. ఒర్రెపై వంతెన నిర్మాణం ఎన్నికల హామీగానే మిగులుతోంది.

మేల్కొనకుంటే ఇబ్బందే...


రోటిగూడ దారిపై పారుతున్న నీరు(ఫైల్)

జన్నారం: మండలం లోతొర్రె గిరిజన గ్రామం జన్నారం మండల కేంద్రం నుంచి సుమారుగా 15కిలోమీటర్లు ఉంటుంది. కవ్వాల్ మీదుగా సోనాపూర్ తండా దాటి లోతొర్రెకు వెళ్లే దారిలో వాగు దాటాల్సి ఉంటుంది. వాగు దాటాక రెండు కిలోమీటర్ల దూరంలో గ్రామం ఉంటుంది. గత సంవత్సరం వరుసగా పది రోజులు భారీ వర్షాలు పడటం వల్ల వాగు ఉప్పొంగి పది రోజులుగా లోతొర్రె గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. గిరిజనులు అనేక ఇబ్బందులకు గురయ్యారు. ఈ సారి ఆ వాగుపై వంతెనకు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయించారు. అధికారులు త్వరగా పనులు మొదలుపెడితే తప్పా, ఈ వర్షకాలంలో కూడా వారికి కష్టాలు తప్పేలా లేవు. మండలంలోని రోటిగూడకు వెళ్లే దారిలో ప్రధాన రహదారిపై ఒర్రె పారుతుంది. ఒర్రెపై వంతెన నిర్మాణం లేక, అధిక వర్షాలకు ఒర్రె ఉప్పొంగితే రాకపోకలు నిలిచిపోతాయి. గత సంవత్సరం ఆ గ్రామ ప్రజలు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. వంతెనకు నిధులు మంజూరైనా ఇప్పటికీ, టెండర్ ప్రక్రియ దశలో ఉండటంతో ఈ వర్షకాలం కూడా ఇబ్బందులు తప్పేలా లేవు.

బ్రిడ్జి నిర్మించాలి


పోతపల్లికి వెళ్లే దారిలో వాగు (ఫైల్)

లక్సెట్టిపేట: మండలంలోని పోతపల్లి గ్రామానికి వెళ్లేందుకు ఉన్న ప్రధాన రహదారి మధ్యలో ఉన్న వాగు వర్షాకాలం వచ్చిందంటే చాలు పై నుంచి నీరు పారుతుంది. దీంతో గ్రామానికి రాకపోకలు స్తంభిస్తాయి. గత కొద్ది సంవత్సరాల నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతున్నా, బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించలేదు. గత సంవత్సరం రూ.రెండు కోట్ల నిధులు మంజూరైనప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు భూమిపూజ, శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించలేదు. ఇప్పటికీ పనులు ప్రారంభించకపోవడంతో ప్రజలు ప్రస్తుత సంవత్సరం కూడా ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకొని బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేయాలని కోరుతున్నారు.

శిథిలావస్థలో లోలెవల్ వంతెన

చెన్నూర్‌రూరల్: మండలంలోని శివలింగపూర్ అక్కెపల్లికి వెళ్లే దారిలో వాగుపై ఉన్న రోడ్ డ్యాం పూర్తిగా కుంగిపోయి శిథిలావస్థకు చేరింది. వర్షాకాలంలో వాగు ఉప్పొంగడంతో అక్కెపల్లి గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి, రోడ్ డ్యామ్ మరమ్మతులు చేసి రాకపోకలు స్థంభించకుండా చర్యలు తీసుకోవాలి.


శిథిలావస్థకు చేరిన అక్కెపల్లి వాగుపై వంతెన

అసంపూర్తి వంతెనతో అవస్థలు

కోటపల్లి: మండలంలోని కొత్తపల్లి రాజారం బబ్బరుచెల్క గ్రామాల మధ్య వాగుపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణం, నక్కలపల్లి లోతొర్రె పై ఉన్న లోలెవల్ వంతెనతో గ్రామస్తులు ప్రతి వర్షాకాలంలో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అధికారులు, నాయకులు వచ్చి చూసిపోవడం తప్పా, వాగులపై వంతెనలు పూర్తికాక వర్షాకాలం వచ్చి దంటే గ్రామస్తులకు తీవ్ర భయం నెలకొంటుంది. ఇటీవల కొత్తపల్లి రాజారం గ్రామప్రజలు ఎన్నికలు బహిష్కరణ చేస్తామని హెచ్చరించడంతో అధికారులు స్పందించి త్వరలోనే గ్రామానికి రోడ్డు నిర్మాణంతో పాటు వాగుపై వంతెన నిర్మాణాలు అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు.


రాజారం బబ్బరుచెల్క మధ్య అసంపూర్తిగా వంతెన

వంతెనలు లేక ప్రజల ఇబ్బందులు

మందమర్రిరూరల్: మందమర్రి మండలంలోని అందుగులపేట గ్రామాన్ని ఆనుకొని పారుతున్న రాళ్ల వాగు, శంకర్‌పల్లెకు వెళ్లే మార్గంలో ఉన్న పాలవాగు, పొన్నారం సమీపంలోని దొమ్మరి వాగు ప్రజా రవాణ వ్యవస్థకు ఇబ్బందిగా ఉన్నాయి. అందుగులపేట సమీపంలో రాళ్లవాగుపై నిర్మించిన వంతెన కూలిపోయింది. పాలవాగు, దొమ్మరి వాగుపై అసలు వంతెనలు లేక వర్షాకాలంలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.


అందుగులపేటలో తెగిపోయిన రాళ్లవాగుపై వంతెన

క్లుప్తంగా

దొనబండలో డీపీవో పర్యటన


రికార్డులు పరిశీలిస్తున్న డీపీవో

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని దొనబండ గ్రామంలో గురువారం జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) వెంకటేశ్వర్‌రావు ఆకస్మికంగా పర్యటించారు. పంచాయతీలోని రికార్డులు పరిశీలించారు. యాప్ తనిఖీ చేసి సూచనలు చేశారు. గ్రామ వీధుల్లో పర్యటిస్తూ పారిశుధ్య పనులను పర్యవేక్షించి మందలించారు. నర్సరీని సందర్శించి, విస్తృతంగా మొక్కలు నాటి సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కంపోస్ట్ షెడ్, చెత్త వేరు చేసే కార్యక్రమాన్ని నిరంతరం చేపట్టాలని, వైకుంఠధామం వినియోగంలో ఉండేలా చూడాలన్నారు. ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఉదయ్ ఉన్నారు.

నూతన యంత్రాలకు ఏఐటీయూసీ కృషి


కాసిపేట-1 గని వద్ద నూతన యంత్రాలు

కాసిపేట: నూతన ఎస్‌డీఎల్ యంత్రాలు నడపడంతో ఉత్పత్తితో పాటు ఆపరేటర్స్ మానసికంగా, శారీరకంగా సక్రమంగా ఉండేందుకు నూతన యంత్రాలు ఉపయోగపడుతాయని ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్ తెలిపారు. మందమర్రి ఏరియా కాసిపేట-1 గనికి చేరిన యంత్రాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య డైరెక్టర్ స్థాయిలో చర్చించి గనులకు నూతన ఎస్‌డీఎల్ యంత్రాలను కొనుగోలు చేయడానికి కృషి చేసినట్లు తెలిపారు. గని ఫిట్ కార్యదర్శి మినుగు లక్ష్మీనారాయణ, నాయకులు శ్రీహరి, రాజేందర్, సురేష్, లింగయ్య, సంపత్, సంతోష్, కమలాకర్, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

ఓసీలో రక్షణపై అప్రమత్తంగా ఉండాలి


అధికారులకు సూచనలు చేస్తున్న జీఎం

మందమర్రిరూరల్: ఓసీ గనుల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు, అధికారులు రక్షణపై అప్రమత్తంగా ఉండాలని ఏరియా జీఎం మనోహర్ సూచించారు. ఏరియాలోని జీఎం ఆఫీస్‌లో గల కాన్ఫరెన్స్ హాల్లో గురువారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో అధికారులను రక్షణ పట్ల తీసుకుంటున్న చర్యలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు సూచనలు చేశారు. గనుల్లో రక్షణ సూత్రాలను పాటించి, యాజమాన్యం నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తిని సాధించాలని తెలిపారు. సమావేశంలో బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ ఆఫీసర్ రఘుకుమార్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, ఏజెంట్‌లు, ఆయా గనుల మేనేజర్లు, అధికారులు ఉన్నారు.

ప్రజల రక్షణ కోసమే 'కమ్యూనిటీ కాంటాక్ట్'

బెల్లంపల్లిరూరల్: ప్రజల రక్షణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలొద్దిన్ అన్నారు. బెల్లంపల్లి మండలం పెర్కపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని లంబాడీతండా గ్రామంలో తాళ్లగురిజాల ఎస్సై గోపతి నరేష్ ఆధ్వర్యంలో గురువారం కమ్యూనిటీ కాంటాక్ట్ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గ్రామాల్లో గుడుంబా తయారు చేసినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏమైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలిపారు. బెల్లంపల్లి రూరల్ సర్కిల్ ఎస్సైలు రమేష్, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి లయన్స్‌క్లబ్ కార్యవర్గం ఎన్నిక

బెల్లంపల్లి: బెల్లంపల్లి సింగరేణి లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2024-25 సంవత్సరానికి గాను కొత్త కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా కొంకటి అంజయ్య, సెక్రెటరీగా వంగల చక్రపాణి, కోశాధికారిగా కొడిప్యాక శ్రీనాథ్, మెంబర్‌షిప్ కోఆర్డినేట్‌గా బోనగిరి వేణుగోపాల్, సర్వీసు కో ఆర్డినేట్‌గా పెద్దిరాజు, మార్కెటింగ్ కో ఆర్డినేట్‌గా నల్మాస్‌సంతోష్ ఎంపికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఫస్ట్ వైస్ డిస్టిక్ గవర్నర్ కోదండరాం, జిల్లా అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కె.సత్యనారాయణ, మున్సిపల్ కౌన్సిలర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు వినేందుకే 'పల్లె నిద్ర'

వేమనపల్లి: గ్రామాల్లో ప్రజా సమస్యలు తీర్చేందుకే 'పోలీసు పల్లెనిద్ర' కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్ అన్నారు. మండలంలోని గొర్లపల్లిలో గురువారం ఏర్పాటు చేసిన పల్లెనిద్రలో ఆయన పాల్గొన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా, తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కోటపల్లి ఎస్సై రాజేందర్, కానిస్టేబుల్ బండి రాజన్న పాల్గొన్నారు.

తాండూర్: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా అసాంఘిక శక్తులను అరికట్టడం కోసమే 'గ్రామాల్లో పోలీసు నైట్‌హాల్ట్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మాదారం ఎస్సై గొల్లపల్లి అనూష అన్నారు. బుధవారం రాత్రి మాదారం పోలీస్ స్టేషన్ పరిధిలోని పోచంపల్లిలో పోలీస్ నైట్ హాల్ట్ కార్యక్రమం నిర్వహించారు.


గొర్లపల్లిలో మాట్లాడుతున్న రూరల్ సీఐ సుధాకర్

కలెక్టర్‌కు వినతి

మంచిర్యాలటౌన్: జిల్లాకు వచ్చిన నూతన కలెక్టర్ కుమార్ దీపక్‌ను వివిధ స్వచ్ఛంద సంస్థల సభ్యులు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు సంబంధించి, వాటిని ప్రేరేపించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందించారు.


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ

రామకృష్ణాపూర్: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. ప్రజలకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని సిబ్బందికి సూచించారు. పట్టణ ఎస్సై రాజశేఖర్ పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు పూజలు

దండేపల్లి: వర్షాలు కురువాలని, పాడి-పంట బాగా పండాలని దండేపల్లిలో ప్రజలు గ్రామదేవతలైన పోచమ్మ, పెద్దమ్మతల్లి, దేవతలతో పాటు, పెద్దయ్య, చిన్నయ్య దేవుళ్లకు గురువారం ప్రత్యేక పూజలు చేశారు.

భీమిని: వర్షాలు కురవాలి.. పంటలు సంవృద్ధిగా పండాలని కన్నెపల్లి మండల కేంద్రంలో మహిళలు పెద్ద ఎత్తున బిందెలతో నీటిని తెచ్చి వేంకటేశ్వర స్వామి ఆలయంలో జలాభిషేకం చేశారు. మహిళలంతా మూడు రోజులుగా మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి, భీమన్న, పోశమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

కార్మికుల సమస్యలపై ఐఎన్‌టీయూసీ వినతి

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట-2 గనిపై కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. మందమర్రి ఏరియా వైస్ ప్రెసిడెంట్ దేవి భూమయ్య మాట్లాడుతూ.. కాసిపేట-2గనిపై మ్యాన్‌రైడింగ్‌ను వీలైనంత త్వరగా ప్రారంభించి, నడక భారాన్ని తగ్గించాలన్నారు. గనిలో తాగు నీటి సౌకర్యం కల్పించాలని, గాలి లేని ప్రదేశాల్లో సరిపడా గాలి ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గని ఫిట్ కార్యదర్శి కారుకూరి తిరుపతి, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి రవికిరణ్, గాలి పరమేశ్వర్, చింతం సత్తయ్య, నక్క హరీష్, జగన్, రమేష్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

దేవాపూర్‌లో వైద్య శిబిరం

కాసిపేట: మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో మంచిర్యాలకు చెందిన శ్రీరామ పిల్లల ఆస్పత్రి వారితో గురువారం ఉచిత పిల్లల వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కంపెనీ యూనిట్ హెడ్ మహేందర్‌ప్రతాప్‌జోషి, ఆనంద్‌కులకర్ణి హాజరై ప్రారంభించి మాట్లాడారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో వైద్యులు రాజేష్, ఓరియంట్ డిస్పెన్సరీ వైద్యులు నవీన్ , వంశీ, ప్రభుత్వ వైద్యులు ఝాన్సీ, సాయిప్రకాష్ పాల్గొని ఉచిత మందులు అందజేశారు.

సంక్షిప్త వార్తలు

'వివాదాస్పద భూముల్లోకి వెళ్లకూడదు'

వేమనపల్లి: గోదుంపేట శివారులోని వివాదాస్పద అటవీ భూమి హైకోర్టు పరిధిలో ఉన్నందున ఎవరూ సాగుకు యత్నించకూడదని తహసీల్దార్ రమేష్, కుశ్నపల్లి అటవీ రేంజర్‌గోవింద్‌చంద్ సర్దార్ అన్నారు. గురువారం సర్వేయర్ ఆశిష్‌తో కలిసి ఒడ్డుగూడం సమీపంలో ఉన్న గోదుంపేట వివాదాస్పద భూమిలో జాయింట్ సర్వే నిర్వహించారు. వివాదాస్పద భూమిలో రాజారాం గ్రామానికి చెందిన 32 మంది గిరిజనులు, వేమనపల్లికి చెందిన 48 మందికి గతంలో పట్టాలు ఇచ్చారు. ఆ భూమిలో సాగు చేసుకోనివ్వడం లేదని గిరిజనులు గత సోమవారం కలెక్టరేట్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్, రేంజ్ అధికారి క్షేత్ర స్థాయికి వెళ్లి జాయింట్ సర్వే చేశారు. ఇరు శాఖల నివేదికలను జిల్లా కలెక్టర్‌కు పంపిస్తున్నట్లు తహసీల్దార్ వెల్లడించారు. వీరి వెంట ఆర్ఐ లక్ష్మణ్, ఎఫ్ఎస్ఓ బేగ్, ఎఫ్‌బీఓ పోచన్న , సర్వేయర్ ఆశిష్ ఉన్నారు.

మాతాశిశు సంరక్షణపై అవగాహన

మందమర్రిరూరల్: పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియాలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం మాతా శిశు సంరక్షణ అంశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంక్షేమ అధికారిని డాక్టర్ నీరజ హాజరై ఏఎన్ఎంలకు అవగాహన కల్పించారు.

దరఖాస్తుల ఆహ్వానం

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్, తెలుగు, కంప్యూటర్, ఫిజిక్స్ సబ్జెక్టులు బోధించేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీదేవి కోరారు. నెట్, సెట్, పీహెచ్‌డీ ఉండాలని అనుభవం, ఇంటర్వ్యూ ఆధారంగా త్రిసభ్య కమిటీ ద్వారా నియమించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తుతో పాటు తమ సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలను జత చేసి 29వ తేదీ మధ్యాహ్నం 3గంటల లోపు దరఖాస్తులు అందించాలని పేర్కొన్నారు.

ఎన్‌హెచ్‌ఏఐ చైర్మన్‌కు ఫిర్యాదు

బెల్లంపల్లి: బెల్లంపల్లి శివారు నేషనల్ హైవేలో ఏర్పాటు చేసిన వెంచర్లు, యూటర్న్ వల్ల కలుగుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ గురువారం బెల్లంపల్లికి చెందిన న్యాయవాది, సామాజిక కార్యకర్త మాదరి రాకేష్ ఢిల్లీలో ఎన్‌హెచ్‌ఏఐ చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. హైవేను ఆనుకొని కొందరు రియల్టర్లు అక్రమ వెంచర్లు ఏర్పాటు చేశారని, మరో పక్క ఓ వెంచర్ వద్ద యూటర్న్ ఏర్పాటు చేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, హైవే రోడ్డు మార్గంలో నిబంధనలకు విరుద్ధంగా వైన్స్ షాపులను ఏర్పాటు చేశారని, అక్రమ కట్టడాలు ఉన్నట్లు ఎన్‌హెచ్‌ఏఐ చైర్మన్‌కు అందజేసిన ఫిర్యాదు పత్రంలో పేర్కొన్నారు. ఆయా సమస్యలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని రాకేష్ విజ్ఞప్తి చేశారు.

కోటపల్లి ఎంపీవోగా సత్యనారాయణ

కోటపల్లి: మండల పంచాయతీ అధికారిగా సత్యనారాయణ గురువారం ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన అక్తర్ తాండూర్‌కు వెళ్లారు.

'గుడిసెలు కూల్చేయడం అమానుషం'

చెన్నూర్: మండలంలోని బావురావుపేట శివారులోని సర్వే నంబర్ 8లో గల ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలను కొంత మంది భూకబ్జాదారులు కూల్చేయడం అమానుషమని బీఆర్ఎస్ ఎస్సీ నాయకులు, మున్సిపల్ 4వ వార్డు కౌన్సిలర్ రేవెల్లి మహేశ్ ఆరోపించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది కాలంగా పేదలు గుడిసెలు వేసుకొని ఉంటున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిని గుర్తించి గుడిసెలు వేసుకొని ఉంటున్న వారందరికీ పట్టాలు ఇవ్వాలన్నారు.

'గోదావరి దారిలో చెత్తాచెదారం'

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని గోదావరి నదికి అతి సమీపంలోనే రోడ్డు పక్కన చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు, జంతువుల కళేబరాలు, పాత బట్టలు వేసి పవిత్రమైన గోదావరి నదిని అపవిత్రం చేస్తున్నా, అధికారులు పట్టించుకోవడం లేదంటూ రాష్ట్రీయ హిందూ పరిషత్ గోరక్ష రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్, న్యాయవాది కొట్టే నటేశ్వర్ అన్నారు. మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సద్వినియోగం చేసుకోవాలి

తాండూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీటీసీ సూరం రవీందర్ రెడ్డి అన్నారు. మండలంలోని మాదారం 3 ఇంక్లైన్ ప్రాథమికోన్నత పాఠశాలలో నుంచి పలువురు విద్యార్థులు వేరే పాఠశాలకు వెళ్లనున్నారని సమాచారం తెలుసుకున్న ఆయన గురువారం పాఠశాలకు వెళ్లి విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన అందుతుందని సూచించారు.